RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 17 పేజీలు - 04 వెల - 04/- శనివారం12 అక్టోబర్ 2024

# 108 కొత్త రీచ్‌లు

- ఇసుక సరఫరా పెంచేందుకు అందుబాటులోకి 108 కొత్త రీచ్ లు
- ఇసుక లభ్యత పెంచేందుకు తాజా నిర్ణయం
- ఇసుక అక్రమాలుసహించేది లేదు
- క్షేత్రస్థాయి సమస్యలు తలెత్తకుండా చూడాలి
- కొత్త రీచ్ లు 16 నాటికి అందుబాటులోకి తేవాలి: సీఎం చంద్రబాబు



అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 : రాష్ట్రంలో డిమాండ్ కు తగ్గ స్థాయిలో ఇసుక సరఫరా ఉండేలా చూడాలని....ఈ విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించి వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని సిఎం చంద్రబాబు నాయుడు గారు అధికారులను ఆదేశించారు. మైనింగ్ శాఖపై సిఎం సచివాలయంలో సమీక్ష చేశారు. అక్టోబర్ 16వ తేదీ నుంచి రాష్ట్రంలో ఇసుక సరఫరా కోసం మొత్తం 70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 108 కొత్త ఇసుక రీచ్‌లు అందుబాటులో వస్తాయని సమీక్షలో అధికారులు వివరించారు. ఈ రీచ్ ల ద్వారా రోజూ 80,000 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 30,000 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా జరుగుతోందని...కొత్తగా అందుబాటులోకి వచ్చే రీచ్ లతో అదనంగా 80 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని అధికారులు వివరించారు. ఇసుక బుకింగ్ సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి ఆన్ లైన్ పోర్టల్ తో పాటు రీచ్‌ల వద్ద నేరుగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. తద్వారా ఆన్‌లైన్ పోర్టల్ నుండి బుక్ చేసుకోలేని వారు నేరుగా ఇసుక రీచ్‌కు వెళ్లవచ్చునని ముఖ్యమంత్రి తెలిపారు. ఇసుక రీచ్‌లను డిస్టిక్ లెవల్ శాండ్ కమిటీ ఎంపిక చేసిన ప్రైవేట్ ఏజెన్సీలు నిర్వహిస్తాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏజెన్సీలను డిస్టిక్ లెవర్ శాండ్ కమిటీ టెండర్ల ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తుందని అధికారులు తెలిపారు. ర్యాంప్ ల ఏర్పాటు, రీచ్ ల నిర్వహణ వ్యవహారాలు వీరు చూస్తారని అధికారులు వివరించారు.

మిగతా 2లో

# పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

- ..మంత్రి పార్థసారథి
- ఇళ్లు లేని పేదలకు శాశ్వత గృహాలు
- వైసీపీ పాలనలో అన్నీ అవకతవకలే
- రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు
- ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోంది
- జర్నలిస్టులందరికీ మేలు చేస్తాం
- స్పష్టంచేసిన మంత్రి కొలుసు పార్థసారథి




అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 : రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా నాకు ఇల్లు లేదు అనే మాట అనకుండా వచ్చే అయిదేళ్లలో నిరుపేదలు అందరికీ శాశ్వత గృహ వసతి కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారని, ఆ లక్ష్య సాధన దిశగా గృహనిర్మాణ శాఖ ముందుకు అడుగులు వేస్తున్నదని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ మొదటి అంతస్తులో ఆధునీకరించిన తన చాంబర్‌లో శాస్త్రోక్తంగా శుక్రవారం ఆయన ప్రవేశించారు.ఎస్సీలకు, బీసీలకు మేమే చాంఫియన్లు అని చెప్పుకునే గత పాలకుల హయాంలో గృహ నిర్మాణ శాఖలో ఎన్నో అవకతవకలు జరిగాయని, నిరుపేదల గృహ నిర్మాణాలకై కేంద్రం ఇచ్చిన దాదాపు రూ.4,500 కోట్ల నిధులను పక్కదోవ పట్టించి నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు.

మిగతా 2లో

# పండగల్లో దసరాకు విశిష్ట స్థానం !

నేడు విజయదశమి పర్వదినం



4లో

# కనుల పండువగా శ్రీవారి మహా రథోత్సవం

- తిరుమలలో వైభవంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- శుక్రవారం రాత్రి అశ్వ వాహన సేవతో వాహన సేవలు
- చక్రస్నానంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు





ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 : తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహా రథోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకలో పాల్గొని జయజయధ్వానాలు చేశారు. మహారథంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగారు. గోవింద నామస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. ఈ రోజు (శుక్రవారం) రాత్రి శ్రీవారు అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో భక్తులకు అభయమివ్వనున్నారు. దీంతో శ్రీవారి వాహన సేవలు ముగియనున్నాయి. శనివారం (రేపు) చివరి ఘట్టమైన చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఇప్పటికే టీటీడీ ఈవో శ్యామలరావు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు ప్రశాంతంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు. పుష్కరిణిలో ఇబ్బంది లేకుండా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతుండగా, 26 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. గురువారం 60,775 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25, 288 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి హుండీ కానుకల ద్వారా గురువారం రూ.3.88 కోట్ల ఆదాయం వచ్చింది.

# టాటా వారసుడిగా నోయల్ టాటా

టాటా ట్రస్ట్ చైర్మన్‌గా నియామకం



ముంబై, ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 : టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటా వారసుడిగా నోయల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా సవతి తల్లి కుమారుడైన నోయల్ టాటా..టాటా ట్రస్ట్ తదుపరి చైర్మన్‌గా ఎంపికయ్యారు.67 ఏండ్ల వయస్సు కలిగిన నోయల్ టాటా సరైన వ్యక్తి అని టాటా సన్స్ బోర్డు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం నోయల్..టాటా గ్రూపునకు చెందిన రిటైల్ బిజినెస్‌ను చూసుకుంటున్నారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిన రతన్ టాటా బుధవారం అర్ధరాత్రి మరణించిన విషయం తెలిసిందే.దీంతో టాటా గ్రూపు కొత్త చైర్మన్ ఎవర్ని ఎంపిక చేసేదానిపై శుక్రవారం ముంబైలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో బోర్డు ఏకగ్రీవంగా నోయల్‌ను ఎంపిక చేసింది.

మిగతాది 2లో...

# చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు

## కియా షోరూమ్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్

- రాష్ట్రం నుంచి తరలి వెళ్లిన పెట్టుబడులను తిరిగి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్న మంత్రి
- జగన్ జిల్లాల పర్యటనకు వెళితే చట్ట ప్రకారం అనుమతి ఇస్తామని వెల్లడి



అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 : మంగళగిరి పరిధిలోని కొలనుకొండలో కియా కార్ల షోరూమ్‌ను మంత్రి నారా లోకేశ్ ఇవాళ (శుక్రవారం) ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో పక్క రాష్ట్రాలతో ఏపీ పోటీ పడాలని అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టబోమని, పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడతామన్న వారందరినీ తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన చెప్పారు. టీసీఎస్, లులూ, రిలయన్స్ వంటి కంపెనీలు ప్రస్తుతం ఏపీ వైపు చూస్తున్నాయని ఆయన అన్నారు. దానికి కారణం మన బ్రాండ్ అంబాసిడర్, ఆయన పేరే నారా చంద్రబాబు నాయుడు అని లోకేశ్ పేర్కొన్నారు.

మిగతా 2లో

# డిప్యూటి సీఎం ప్రత్యేక శ్రద్ధ ..



2లో

- పిఠాపురం సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది నియామకం
- సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న ప్రజలు

# 108 కొత్త రీచ్ లు

ఇసుక రీచ్‌లోని ఇసుక స్టాక్ పాయింట్‌ను 24 గంటలు ఆపరేట్ చేయడానికి వారిని అనుమతిస్తామని, తద్వారా నిరంతర సరఫరాను కొనసాగించవచ్చు అని అధికారులు తెలిపారు. అయితే రీచ్ పాయింట్ వద్ద ఇసుక సరఫరా రేటు డీఎల్ఎస్‌సీ నిర్ణయించినట్లుగా ఉండాలని సిఎం సూచించారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను త్వరితగతిన అనుమతించడం ద్వారా మార్కెట్‌లో ఇసుక లభ్యత పెంచబోతున్నట్లు అధికారులు వివరించారు. అయితే ఎక్కడా అక్రమాలకు తావులేకుండా చూడాల్సిన అవసరం ఉందని...దీని నిరంతర నిఘాతో పాటు నిత్యం పర్యవేక్షణ చేయాలని అధికారుల సిఎం ఆదేశించారు. ఇసుక లభ్యత, రవాణా ఖర్చులు, ఆపరేషన్ ఖర్చులు మొదలైన వాటి గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ సమాచారాన్ని పంపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెకింగ్, %ఊూ% ట్రాకింగ్, ఆడిట్ ల ద్వారా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చూడాలని సిఎం ఆదేశించారు. డెలివరీలను వేగవంతం చేయడానికి మరిన్ని వాహనాలను అందుబాటులోకి తెచ్చుకోవాలని సిఎం సూచించారు. ఇసుక నిత్యావసరంగా భావించి సరఫరాకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని సిఎం సూచించారు. ఇసుక రవాణా ధరలు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఇసుక రీచ్‌ల సంఖ్యను పెంచేందుకు ప్రైవేట్ వ్యక్తులు కూడా మైనింగ్ డిపార్ట్‌మెంట్ నుండి అనుమతితో తవ్వకాలు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. అయితే ప్రైవేట్ వ్యక్తుల కోసం అనుమతించబడిన ఈ కొత్త ప్రైవేట్ ఇసుక రీచ్‌లలో కూడా డీఎల్ఎస్‌సీ నిర్ణయించిన ధరకే ఇసుకను సరఫరా చేయాల్సి ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. ఇసుక విషయంలో ప్రజల నుంచి పూర్తి స్థాయిలో సానుకూల స్పందన వచ్చేలా అధికారుల చర్యలు ఉండాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

# క్రీడాకారులకు నంద్యాల మహిళా వైద్యుల ఆర్థిక సహాయం

**ఆంధ్ర ప్రగతి**
**నంద్యాల టౌన్ అక్టోబర్ 11:**
ఈనెల 14వ తేదీ నుండి గోవా రాష్ట్రంలోని వాస్కోడిగామా రవీంద్ర భవన్ లో నిర్వహించనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటున్న నంద్యాల పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఐఎంఏ నంద్యాల మహిళా వైద్యులు శుక్రవారం ఆర్థిక సహకారం అందజేశారు.



ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో, రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి ల నిర్వహణలో స్థానిక ఐఎంఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న నంద్యాల క్రీడాకారులు పల్లవి, మహేష్ ,నరసింహ లకు పదివేల రూపాయల ఆర్థిక సహకారం అందించారు.

ఐఎంఏ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ వసుధ రాణి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఐఎంఏ చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈరోజు రాష్ట్రం తరపున పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ సహకారం అందజేశామన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేశంలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఐఎంఏ నంద్యాల ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాధవి, మిషన్ పింక్ హెల్త్ విభాగం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి,అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి,మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద , పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పల్లవి ,మహేష్, నరసింహ పాల్గొన్నారు.

# ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువు

**ఏపీలో నూతన మద్యం విధానం**
**ఈ నెల 14న లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు**
**ఈ నెల 15న లైసెన్స్ ల జారీ**

అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 :
ఏపీలో నూతన మద్యం పాలసీలో భాగంగా వైన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ గడువు నేటి రాత్రి 7 గంటలకు ముగిసింది. మద్యం దుకాణాల లైసెన్స్ ల కోసం భారీ స్పందన కనిపించింది. రాష్ట్రంలో మొత్తం 3,396 మద్యం దుకాణాలకు 87,116 దరఖాస్తులు వచ్చాయి.
అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో 113 వైన్ షాపుల




కోసం 5,764 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా అల్లూరి జిల్లాలోని 40 దుకాణాలకు 1,179 దరఖాస్తులు వచ్చాయి. తిరుపతి జిల్లాలోని 227 మద్యం షాపుల కోసం 3,659 దరఖాస్తులు వచ్చాయి. కాగా, ఈ రాత్రి 12 గంటల వరకు దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా రూ.1,742 కోట్ల ఆదాయం లభించింది. ఈ నెల 14న లాటరీల ద్వారా మద్యం దుకాణాలు కేటాయించనున్నారు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారికి ఈ నెల 15న లైసెన్స్ లు జారీ చేయనున్నారు. ఈ నెల 16 నుంచి రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది.

# డిప్యూటీ సీఎం ప్రత్యేక శ్రద్ధ ..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో



సమీక్షలు జరుపుతున్నారు. అధికారుల బృందాన్ని పిఠాపురం నియోజకవర్గానికి పంపించి క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలపై పరిశీలన చేయించి నివేదికలు తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో పిఠాపురంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి.)లో వైద్యులు, సిబ్బంది కొరత, ఎక్స్ రే యూనిట్ పని చేయకపోవడాన్ని గుర్తించారు. దీనిపై కాకినాడ జిల్లా కలెక్టర్, డి.ఎం.అండ్ హెచ్.ఓ.లతో చర్చించారు. తక్షణమే పిఠాపురం సి.హెచ్.సి.లో వైద్యులను, సిబ్బందిని నియమించాలని పవన్ ఆదేశించారు. నియోజకవర్గంలో పెద్ద ఆసుపత్రి అయిన సి.హెచ్.సి.లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకూడదని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్ లను పిఠాపురం సి.హెచ్.సి.లో నియమించారు. అదే విధంగా ముగ్గురు స్టాఫ్ నర్సులను, ఒక జనరల్ డ్యూటీ అటెండెంట్ లను నిర్ణయించారు. అలానే ఎక్స్ రే యూనిట్ ను పునరుద్ధరించారు. దీంతో ఎక్స్‌రే యూనిట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సీహెచ్‌సీ మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా శక్తికి నిదర్శనం దసరా

**'శక్తి విజయోత్సవం'లో నారా భువనేశ్వరి**



విజయవాడ, ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 :
'దసరా అంటే మహిళా శక్తికి నిదర్శనం. అందుకే ఈ పండుగ మహిళలకు ప్రత్యేకం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు.విజయవాడ పున్నమి ఘాట్ సమీపంలోని బబ్బూరి గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన 'శక్తి విజయోత్సవం' కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల విజయాలను గుర్తించి వారిని అభినందించాలని, ప్రోత్సహించాలని కోరారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు ఈ సమాజాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాయని చెప్పారు.అయితే ఇవన్నీ నాణేనికి ఒకవైపు మాత్రమేనని, మహిళలపై ఇంకా సమాజంలో వివక్ష కనిపిస్తోందని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళా తాను నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. 'ప్రతి మహిళా తమలో ఉన్న దుర్గా శక్తిని గుర్తించాలి, అప్పుడే విజయం లభిస్తుంది. చేనేత, వారంలో రెండుసార్లు అయినా చేనేత వస్త్రాలు ధరించాలి. రాజకీయ, సినీ, వ్యాపార రంగాల వారు కూడా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలి' అని భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'స్త్రీ లేకపోతే జననం లేదు... స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు... స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు... అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ శక్తిని కలిగిన ప్రతి స్త్రీని గౌరవిద్దాం' అని ఆమె కోరారు. హోంమంత్రి అనిత, బీసీ మంత్రి సవిత, పర్యాటక మంత్రి దుర్గేశ్ ప్రసంగించారు.

## పేదల సొంతింటి కల
# నెరవేరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్కొక్క యూనిట్ కు రూ.2.50 లక్షల రుణ సహాయాన్ని అందజేస్తే, దాన్ని రూ.1.80 లక్షలకు తగ్గించడమే కాకుండా ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణానికై రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు అదనంగా అందజేసే ఆర్థిక సహాయాన్ని కూడా పూర్తిగా రద్దు చేసిన ఘనత గత ప్రభుత్వానిదే అన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఎన్నో తప్పిదాలు జరిగాయని, రాష్ట్రాన్ని రూ.10.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దింపడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకు వచ్చారన్నారు. రాష్ట్రంలో ఎటు వంటి ఆదాయ వనరులు, అభివృద్ధి లేకుండా చేశారని, గతంలో జరిగిన ఇటువంటి తప్పిదాలు అన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రాన్ని ఒక గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం వంద రోజుల పాలనలో ముఖ్యమంత్రి ఎంతగానో కృషిచేశారని మంత్రి తెలిపారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని, అభివృద్ధిని అందిపుచ్చుకునేలా యువతీ యువకులను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో స్కిల్ సెన్సెస్ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. ప్రజలు కేవలం సంక్షేమ పథకాలపైనే ఆధారపడకుండా వారికి బంగారు భవిష్యత్తును ఏర్పాటుచేసే దిశగా కృషి జరుగుతోందని, 2029 నాటికి రాష్ట్ర జీడీపీ , ప్రతి పౌరుడి తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనే కాకుండా, ఇంకా వారికి ఏ విధంగా మేలు చేకూర్చగలమో అనే కోణంలో ఆలోచించి ప్రతిపాదనలు రూపొందించాలని ఈ మధ్య జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లుగా తగు చర్యలు చేపట్టడం జరిగిందని మంత్రి తెలిపారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెపుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రకటనలు జారీలో ఇష్టానుసారంగా ప్రవర్తించడమే కాకుండా తమకు నచ్చిన పేపర్లకు పెద్ద ఎత్తున జారీచేస్తూ, నచ్చని పేపర్లు వాటంతట అవే విత్ డ్రా అయ్యే పరిస్థితులు కల్పించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయంలో రూ.200 -లు పత్రిక కొనుగోలుకు ఇస్తూ అనధికారికంగా పలానా పత్రికనే కొనుగోలు చేయాలని నిర్దేశించినట్లు సమాచారం ఉందని, దానిపై విచారణ జరుగుతోందన్నారు. సంబంధిత జీవోను కూడా రద్దు చేశామన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి. కె.రాజబాబు, సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్ మంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడి వెళ్లినా చంద్రబాబు నాయుడి రాష్ట్రం అంటున్నారని, ఆయనపై ఉన్న విశ్వసనీయత, నమ్మకం వల్లే రాష్ట్రంలోకి తిరిగి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. భారతదేశంలో ఎక్కడికి వెళ్లినా అక్కడ కనిపించే కియా కార్లు 'మేడిన్ ఆంధ్రప్రదేశ్' కావడం గర్వించదగ్గ విషయమని లోకేశ్ వివరించారు.రాజధాని ప్రాంతంలో ఉన్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు పెద్ద ఎత్తున ఇన్వెస్ట్‌మెంట్స్ వస్తాయని మంత్రి నారా లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. సేవల రంగానికి చెందిన కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకొస్తామని ఆయన అన్నారు. రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమల నెలకొల్పుతామని అన్నారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా, పెట్రో కెమికల్స్ సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జగన్ జిల్లాల పర్యటనకు అనుమతి ఇస్తాం

మాజీ సీఎం జగన్ జిల్లాల పర్యటనకు వెళితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మిషన్ ఇస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక రెడ్‌బుక్‌లో పేరు ఉందంటూ వైసీపీ నాయకులు వణికిపోతున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పాదయాత్ర సమయంలో చెప్పినట్టుగానే భూకబ్జాలకు పాల్పడిన వారిపై, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని అన్నారు. అలాంటి వారిని విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వంపై నకిలీ వార్తలు ప్రచారం చేస్తున్నారని, ఫేక్ ప్రచారం చేసేవాళ్లపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి వార్నింగ్ ఇచ్చారు. ఫేక్ ప్రచారం చేసేవారిపై చర్యల విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరంలేదని అన్నారు.

# టీడీపీ సోషల్ మీడియా పోస్టులపై విజయసాయిరెడ్డి ఫైర్

తాడేపల్లి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 :
టీడీపీ సోషల్ మీడియా పోస్టులపై వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. "తెలుగు దొంగల పార్టీ (పేరుకు తగినట్లుగానే) జ్ఞానం, మర్యాద, అవగాహన లేని పోకిరీలను, పనికిమాలిన కులగజ్జి గాళ్లని, గూండాలని, గోహంతకులని, హిందూ వ్యతిరేకులని, నాస్తికులని, రేపిస్టులని, టీడీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడానికి, విపక్ష నాయకులు పెట్టిన పోస్టులు మీద వ్యక్తిగత దూషణలతో, బూతుపదాలతో కించపరుస్తూ అసభ్యకర వ్యాఖ్యలు చేయడానికి "నెలసరి చెల్లింపు" పద్ధతిలో నియమించుకున్న అనైతిక రాజకీయపార్టీ." అంటూ ట్వీట్ చేశారు."వీరి తల్లితండ్రులు పెట్టిన అసలు పేర్లతో కాకుండా నకిలీపేర్లతో (చివరన రెడ్డి, శర్మ, షెట్టి, యాదవ్, రాజు వగైరా) తగిలించుకుంటారు. వీరి బజారు ప్రవృత్తి, దిగజారుడుతనం ఎలా ఉంటుందంటే(ఉదాహరణకు స్వాతి చౌదరి వారి రాతల్లో శ్వేతారెడ్డి అవుతుంది). పోలీస్, న్యాయవ్యవస్థలకు దొరకకుండా పని చేస్తారు. ఈ క్యారక్టర్ లేని కిరాయి పేటిఎమ్ బ్యాచ్ ధైర్యం ఉంటే అసలు పేర్లతోనే పోస్టులు పెట్టొచ్చు. వీరి వ్యాఖ్యలు టీడీపీ సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలుసుకోవాలి...వారి ముఠా నాయకుడి దృష్టిలో పడాలని పోటీపడి హద్దులుమీరి వ్యాఖ్యలు/పోస్టులు పెడతారు. ఓ కిరాయి మనుషుల్లారా, మీ ఇద్దరు బాసుల కోసం మీరు మరీ దిగజారిపోవద్దు" అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.



# టాటా వారసుడిగా నోయల్ టాటా

జఆయన నియామకం వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా నోయల్ టాటా మాట్లాడుతూ..టాటా గ్రూపు వ్యవస్థాపకుల వారసత్వాన్ని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నానని, శతాబ్దం క్రితం ప్రారంభమైన టాటా గ్రూపు అంచలంచెలుగా ఎదుగుతూ లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నదన్నారు. ఇంతటి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని కొనసాగించడంతోపాటు దాతృత్వ కార్యక్రమాలకు భంగం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

**నోయల్ టాటా బయోడేటా**

బ్రిటన్‌లోని ససెక్స్ యూనివర్సిటీ నుంచి పట్టా పొందిన నోయల్..ఇన్‌సీడ్ నుంచి ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం చేశారు. టాటా గ్రూపుతో ఆయనకు 40 ఏండ్లకు పైగా అనుబంధం ఉన్నది. ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2021 వరకు టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎండీగా విధులు నిర్వహించారు. ఆయన సారథ్యంలో సంస్థ టర్నోవర్ 500 మిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. అంతకుముందు ఆయన ట్రెంట్ లిమిటెడ్ ఎండీ, చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 1998లో ఒక్క స్టోర్‌తో ప్రారంభమైన ట్రెంట్ ప్రస్తుతం 700 స్టోర్లకు విస్తరించింది. ఇప్పటికే ఆయన రతన్ టాటా ట్రస్ట్‌తోపాటు అనుబంధ ట్రస్టులు, దొరాబ్జీ టాటా ట్రస్ట్-అనుబంధ ట్రస్టుల్లో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

# నంద్యాల ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు.

### -జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 11: చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు కూడ ప్రజలందరూ విజయదశమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మల గన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, చాలా పెద్దమ్మ దుర్గమ్మతల్లి ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించడంతో పాటు నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని వారు ఆ ప్రకటలో ఆకాంక్షించారు.

# నంద్యాల ప్రజల కోసం రైతు బజార్లో నిత్యాసర వస్తువులు

### జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 11: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యాసర వస్తువులు సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం శ్రీనివాస్ సెంటర్ సమీపంలోని రైతు బజార్ లో పౌర సరఫరాల శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ప్రారంభించి వినియోగదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెలు అధిక ధరలు వున్న నేపథ్యంలో నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో మాట్లాడి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల పట్టణం శ్రీనివాస నగర్ లోని రైతు బాజార్, టేక్కే మార్కెట్ యార్డ్ లో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. అలాగే ఆత్మకూరులో రెండు కేంద్రాలు, నందికోట్కూరు, బనగానపల్లి మండల కేంద్రాలలోను ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. సన్ ఫ్లవర్ (లీటరు)124/- రూపాయలు, పామ్ ఆయిల్ (లీటరు) 110/- చొప్పున రూపాయలు చొప్పున ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. అలాగే అన్ని రైతు బజార్లలో టమాట కేజీ రూ. 40/-లకు, ఉల్లిగడ్డ కేజీ రు. 35/-ల చొప్పున వినియోగదారులకు విక్రయిస్తామని జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 11: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా ఈ నెల 13 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ఉన్న మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# డోన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిదిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

### -అసాంఘిక , సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం.
### -రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృతంగా దాడులు.
### -ఈ దాడులలో ఎలాంటి ధృవ పత్రాలు లేని 40 ద్విచక్రవాహానాలు, 03 కార్లు స్వాధీనం చేసుకున్నారు.
### -డోన్ డిఎస్పీ పి .శ్రీనివాస్.



ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 11:

నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సంధర్భంగా నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డోన్ పోలీసు అధికారులు మరియు క్యూ ఆర్టి సిబ్బంది స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి నేడు తెల్లవారుజామున డోన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిదిలోని చిగురుమానిపేట నందు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎలాంటి ధృవ పత్రాలు లేని 40 ద్విచక్రవాహానాలు, 03 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ డీఎస్పీ తో పాటు ఇన్స్పెక్టర్లు ఇంతియాజ్ బాష ,రాకేష్ క్యూఆర్టి సిబ్బంది స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి అమరావతి అక్టోబర్ 11: రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ దసరా పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్ల దుష్టపాలనను ఏపీ ప్రజలు తరిమి తరిమి కొట్టారని, కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ పట్టం కట్టారని అన్నారు. సైకో పాలకులను ప్రజా మద్దతుతో తరిమికొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధి లోనే రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలతో పెట్టుబడుల వరద వస్తున్నదని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరద ముంపుతో విజయవాడ ప్రాంతం తీవ్ర విపత్తును ఎదుర్కొన్నప్పటికీ, ప్రజలందరూ ప్రభుత్వానికి చేయూతను అందించడంతో విపత్తును ఎదుర్కోవడంలో ప్రభుత్వం సఫలీకృతం అయిందని అన్నారు. చెడుపై మంచి మరియు దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి అని ఆయన పేర్కొన్నారు .దసరా పండుగ ప్రజలందరికీ మేలు చేయాలని, సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ దసరా పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు.ం

# జిల్లా ప్రజలకు , పోలీసు అధికారులు , సిబ్బందికి విజయ దశమి శుభాకాంక్షలు.

### -జిల్లా పోలీసు కార్యలయంలో ఘనంగా ఆయుద పూజా కార్యక్రమం నిర్వహణ.
### -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.





ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 11: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో ఘనంగా ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీసు కార్యలయం నందు గల అర్మడు రిజర్వ్ విభాగం నందు గల ఆయుధాగారం నందు దుర్గామాతకు అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా ప్రజలు మరియు జిల్లా %ఽ% రాష్ట్ర పోలీసులు సుఖఃశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం పోలీసు ఆయుధాగారంలోని పోలీసులు దైనందిన విధుల్లో వినియోగించే అన్నిరకాల ఆయుధాలకు మరియు మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధ రకాల వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడారు ముందుగా జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తు దుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, జిల్లా %ఽ% రాష్ట్ర పోలీసులు సంతోషంగా జీవించాలని,జిల్లా పోలీసులకు తమ దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలని , ఆయుః:రారోగ్యాలతో ప్రజలతో మమేకమై పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందేలా పోలీసు విధులు ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏన్ .యుగంధర్ బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, జిల్లా సాయుధ పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిషాసురమర్ధినీ దేవిగా నేడు దుర్గమ్మ దర్శనం

### -దేవీ నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 11:నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో ఉన్న శ్రీశ్రీశ్రీ జంబులా పరమేశ్వరి దేవాలయం నందు బేడ బుడగ జంగాల పెద్దలు మరియు దేవస్థానం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమము ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 9వ రోజైన శుక్రవారం (ఆశ్వయుజ శుద్ధ నవమి) నాడు కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ శ్రీ మహిషాసురమర్ధినీ దేవిగా దర్శనమిస్తుందన్నారు . అష్ట భుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే అందుకే ఇది నవదుర్గల్లో అత్యుగ్రరూపం అన్నారు . ఈ రోజున జగన్మాత కనకదుర్గమ్మ లేతరంగు దుస్తుల్లో సింహ వాహనాన్ని అధిష్టించి ఆయుధాలను ధరించిన మహాశక్తిగా భక్తులను సాక్షాత్కరిస్తుందని . ఈ తల్లికి గారెలు, బెల్లంతో కలిపిన అన్నాన్ని నైవేద్యంగా నివేదిస్తారన్నారు . ఇదిలా ఉండగా దసరా శరన్నవరాత్రులు తుది ఘట్టానికి చేరుకున్నాయన్నారు . దశావతారాలలో ఆఖరుగా శనివారంనాడు విజయ దశమి సందర్భంగా జగన్మాత కనకదుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిస్తుందన్నారు . ఈ కార్యక్రమంలో నంద్యాల పుర ప్రముఖులు , బేడ బుడగ జంగాల పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు.

### -నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.



నంద్యాల జిల్లా ప్రజలకు,పోలీసు కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ తరపున విజయ దశమి శుభాకాంక్షలను ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆ దుర్గామాత అన్ని రంగాల్లో అందరికి విజయం చేకూర్చాలని , ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పండుగల్లో దసరాకు విశిష్ట స్థానం !

అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 : దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవరోజు విజయ దశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి, తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి, తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం రివాజు. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. అదే విజయదశమి. హిందువులు జరుపుకునే పండగలలో దసరా పండగకు విశిష్ట స్థానం ఉంది. ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో మొదటి తొమ్మిది రోజులను దసరా నవరాత్రులు, దేవీ నవరాత్రులు లేక శరన్నవరాత్రులు అని అంటారు. ఈ దసరా ఉత్సవాన్ని నవరాత్రులుగా తొమ్మిది రోజులు పాటు జరుపుకుని.. 10వ రోజున దసరా లేదా విజయదశమిగా జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులు శక్తిస్వరూపిణి అయిన దుర్గాదేవి అవతారాలను అంటే నవదుర్గలను అత్యంత భక్తీ శ్రద్ధలతో పూజిస్తారు. ఈ దేవీ నవరాత్రులలో చివరి మూడు రోజులు, దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిగా జరుపుకుంటూ విద్యార్థులు పుస్తకాలూ, పెన్నులను పూజిస్తే, శ్రామికులు తమ పనిముట్లను పూజిస్తారు. ఇక క్షత్రియులు ఆయుధ పూజ చేసి.. అమ్మవారి కృపకు పాత్రులవుతారు. దుర్గాదేవి మహిషాసురమర్దనిగా అవతరించి రాక్షసుని మీదకు దండెత్తి విజయం సాధించింది. అంతేకాదు రాముడు రావణ సంహారం చేసింది దసరనే.. కనుక పూర్వం రాజులు తమ దండయాత్రకు దసరా పండగానే శుభ ముహూర్తంగా ఎంచుకునే వారని తెలుస్తోంది. దేవీ పూజ ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో హెచ్చుగా ఉంటుంది. దైత్యవంశానికి ఆశాదీపంలా జన్మించిన 'మహిషాసురుడు' తన ఆంతరంగిక మిత్రులతో, సచివులతో సమాలోచన చేసి, మరణంలేని జీవనం కోసం మేరుపర్వతశిఖరం చేరి బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు ప్రారంభించాడు. కాలం కదలికలో అనేక వేల సంవత్సరాలు కదిలి వెళ్లిపోయాయి. మహిషాసురుని అచంచల తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, 'మహిషాసురా.., ఇంక తపస్సు చాలించి ఏ వరం కావాలో కోరుకో' అన్నాడు.'పితామహా.,నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు' అని కోరాడు మహిషాసురుడు. అప్పుడు బ్రహ్మదేవుడు



'మహిషాసురా..పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు.., గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు. జననమరణాలు సకలప్రాణికోటికి సహజ ధర్మాలు. మహాసముద్రాలకూ, మహాపర్వతాలకూ కూడా ఏదో ఒక సమయంలో వినాశం తప్పదు. ప్రకృతివిరుద్ధమైన నీ కోరిక తీర్చుట అసంభవం. కనుక,నీ మరణానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరే వరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషా సురుడు 'విధాతా..అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే.. ఆడది నా దృష్టిలో అబల..ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక.,పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా వరం అనుగ్రహించు' అని కోరాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని మహిషాసురునికి అనుగ్రహించి అంతర్ధాన మయ్యాడు. బ్రహ్మదేవుని వరాల వలన వరగర్వితు డైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధము చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజముగా మారింది. త్రిమూర్తుల తేజము కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజము ముఖముగా, విష్ణు తేజము బాహువులుగా, బ్రహ్మ తేజము పాదములుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలమును, విష్ణువు చక్రమును, ఇంద్రుడు వజ్రాయుధమును, వరుణ దేవుడు పాశము, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలము హిమవంతుడు సింహమును వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధములు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన పోరు సల్పింది. మహిషా సురుని తరపున పోరు సల్పుతున్న ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తరువాత మహిషాసురునితో అమ్మ తలపడినది. ఈ యుద్ధములో ఆదేవి వాహనమైన సింహమూ శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషి రూపము, సింహరూపము, మానవరూపముతో భీకరముగా పోరి చివరకు తిరిగి మహిషిరూపములో దేవిచేతిలో హతుడైనాడు.ఈ విధంగా అప్పటి నుండి మహిషుని సంహరించిన దినము కాబట్టి మహిషాసుర మర్ధనిని కొలిచే దసరా పర్వదినంగా ప్రజలచే కొనియాడబడింది. ఉత్తరభారతంలో దసరాను రావణ దహనంగా నిర్వహిస్తారు. దక్షిణాన శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపుగా నిర్వహిస్తారు. ఇలా ఒక్కోచోట ఒక్కో విధంగా అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది.

# ఎపిలో తక్కువ ధరలకే వంటనూనెలు

## రేషన్ దుకాణాల్లో అందుబాటులో సరుకులు

అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11 :పండుగవేళ సామాన్యులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. కూరగాయలు, నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగిన ఈ తరుణంలో తక్కువ ధరకే వంటనూనెలను అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో కిలో పామాయిల్ రూ.110, సన్‌ఫ్లవర్ నూనె రూ.124కే అందించాలని నిర్ణయించింది. ఈ ధరలు నేటి నుంచి ఈ నెలాఖరు వరకు అందుబాటులో ఉండనున్నాయి. అయితే ఒక్కో రేషన్ కార్డుపై మూడు లీటర్ల పామాయిల్, ఒక లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ చొప్పున మాత్రమే ఇవ్వనున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వర్తక సంఘాల



ప్రతినిధులతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధరల నియంత్రణపై చర్చించారు. ఇండోనేసియా, మలేసియా, ఉక్రెయిన్ నుంచి దిగుమతులు తగ్గడంతో పాటు పన్నులు, ప్యాకేజి ఖర్చులు పెరగడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు వివరించారు. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ధరలు కాకుండా రాష్ట్రమంతటా ఒకే ధరపై విక్రయించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. దీనికి డీలర్లు, సప్లయర్స్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రతి రేషన్ కార్డుపై సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను గరిష్ఠంగా 124, పామాయిల్‌ను రూ.110కి విక్రయించేందుకు అంగీకరించారు.

# ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను నియమించిన తెలంగాణ ప్రభుత్వం



**హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించిన ప్రభుత్వం**

**60 రోజుల్లో నివేదికను సమర్పించాలని ఆదేశం**

**ఎస్సీ వెనుకబాటుతనాన్ని ఉపకులాల వారీగా అధ్యయనం చేయనున్న కమిషన్**

ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11
ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించింది. 60 రోజుల్లో ఎస్సీ వర్గీకరణపై నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎస్సీల వెనుకబాటుతనాన్ని ఉపకులాల వారీగా ఈ ఏకసభ్య కమిషన్ అధ్యయనం చేయనుంది.సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. పలు పర్యాయాలు సమావేశమైన ఈ కమిటీ... ఎస్సీ రిజర్వ్‌డ్ కులాల వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం షమీమ్ అక్తర్‌ను నియమించింది.

# సుప్రీం కోర్టు ఆదేశాలతో సీఐడీ మాజీ ఏఎస్పీ ప్రత్యక్షం





అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11
వైసీపీ ప్రభుత్వం హయాంలో అదే పార్టీ ఎంపీ అయిన తనను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో చిత్రహింసలకు గురిచేశారని ఆరోపిస్తూ ప్రస్తుత ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు గుంటూరు జిల్లాలో పోలీసు అధికారుల మీద కేసు పెట్టిన విషయం తెలిసిందే.
ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐడీ విభాగం రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్ పోలీసు అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు.
కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్న విజయ్ పాల్ ఎట్టకేలకు పోలీసు అధికారులు ముందు హాజరు కావడంతో ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కేసు ఊహించని మలుపు తిరిగింది. సీఐడీ విభాగం మాజీ అధికారి విజయ్ పాల్ తో పాటు మరి కొందరు పోలీసు అధికారులు తనను పోలీస్ స్టేషన్ లో నిర్బంధించి చిత్రహింసల గురి చేశారని, తాను అప్పుడు వైసీపీ ఎంపీగా ఉన్నారని రఘురామ కృష్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.నిబంధనలకు విరుద్ధంగా తనను అనేక ఇబ్బందులకు గురి చేసిన సీఐడీ మాజీ అధికారులపైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రఘురామకృష్ణరాజు గుంటూరు జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మాజీ సీఎం జగన్ తో పాటు మరి కొందరు పోలీసు అధికారుల పైన టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కేసు పెట్టారు. కేసు నమోదు అయిన వెంటనే సీఐడీ మాజీ ఏఎస్పీ విజయ్ పాల్ పారిపోయారు.తర్వాత ముందస్తు బెయిల్ ఇవ్వాలని విజయ్ పాల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆయన బెయిల్ పిటీషన్ ను కొట్టేసింది. ఆతర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన విజయ్ పాల్ సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. ఇటీవల విజయ్ కాల్ బెయిల్ పిటిషన్ విచారణ చేసిన సుప్రీం కోర్టు తొందరపడి విజయ్ పాల్ ను అరెస్టు చేయకూడదని ఆంధ్రప్రదేశ్ పోలీసులకు సూచించింది.అయితే ఈ కేసులో పోలీసుల ముందు విచారణకు కచ్చితంగా సహకరించాలని ఇదే సమయంలో సుప్రీం కోర్టు విజయ్ పాల్ కు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం గుంటూరు జిల్లా పోలీసు అధికారుల ముందు విజయ్ పాల్ విచారణకు హాజరయ్యారు. టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కేసులో ఎట్టకేలకు విజయ్ పాల్ పోలీసుల ముందు ప్రత్యక్షం కావడంతో పోలీసులు ఆయన్ను విచారణ చేస్తున్నారు.

# డీఎఫ్‌వో పై ఆరోపణలు

## విచారణకు ఆదేశించిన పవన్



అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11
కాకినాడ డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌రెడ్డి మైనింగ్ వాహనాల విషయంలో కొన్ని రకాల ఆంక్షలు విధించారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన పేషీలోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి పేర్లు చెప్పి మైనింగ్, అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎంకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ విచారణకు ఆదేశించారు. తన పేరు, కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కనకదుర్గమ్మకు వెంకటేశ్వర స్వామి పట్టు వస్త్రాలు

## తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టు వస్త్రాల సమర్పణ



ఏడుకొండల పై కొలువై ఉన్నదేవ దేవుడు కలియుగ దైవం పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పట్టు వస్త్రాలను కనకదుర్గమ్మ వారికి సాంప్రదాయ బద్ధంగా సమర్పించారు. స్వామి వారి సన్నిధి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారి బి. దొరస్వామి ఆధ్వర్యంలో మహిషాసుర మర్దని అలంకృత కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు శుక్రవారం సమర్పించారు. వీరికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామరావు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ రామారావు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రం, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఎస్. కళాబాయి, బిఎస్ ప్రియదర్శిని,బి. భరత్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేనెలలో బడ్జెట్ సమావేశాలు

అమరావతి: ఆంధ్ర ప్రగతి అక్టోబరు 11
రాష్ట్ర వార్షిక బడ్జెట్ (2024-25) సమావేశాలు వచ్చేనెలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించింది. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో లోటుపాట్లకు అనుగుణంగా మరో విడత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ఆమోదించింది. వచ్చే నెలాఖరుతో గడువు ముగియనుంది.గత ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో నిధులు మళ్లింపు జరిగింది. ఆయా శాఖల పరిధిలో గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీలను గుర్తించడంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడ్లాది జూలై నెలాఖరులోగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్థికశాఖ సర్క్యులర్ కూడా జారీ చేసింది. అయితే పూర్తి స్థాయిలో సమగ్రమైన సమాచారం లేకపోవటంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు.. కొత్తగా పునరుద్ధరణ పథకాలకు అయ్యే ఖర్చులు.. ఆదాయం అంచనాలపై స్పష్టత రాలేదు. దీంతో డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు చివరి విడత కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆర్డినెన్స్ తెచ్చి 2025-26 బడ్జెట్ సమావేశాల్లో రెండేళ్ల బడ్జెట్‌కు ర్యాటిఫై చేసుకునే అంశాన్ని పరిశీలన జరిపింది.